
ప్రజాశక్తి

బుధవారం 8 జనవరి 2025

5

విజయనగరం



జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షులు గవర సూరిబాబు, కార్యదర్శి కెవిఎన్ రాజు(చిన్నారి) హర్షం వ్యక్తం చేశారు. మనోజ్, విజయలక్ష్మి, ప్రవల్లిక ఆంధ్రప్రదేశ్ నుంచి ఈనెల 7వ తేదీ నుండి రాజస్థాన్ లోని జైపూర్ లో జరిగే సీనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జార్ఖండ్ తరపున సాగర్ పాల్గొంటారని తెలిపారు. విజయలక్ష్మి అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్‌లో జరిగే కోచింగ్ క్యాంప్‌కు దేశం తరుపున పాల్గొనడం విజయనగరం జిల్లాకు గర్వకారణమని తెలిపారు.

ప్రధాని వస్తున్నారని బడులకు సెలవు

ఆర్టీసి బస్సులూ మళ్లింపు

24వేల మంది తరలింపునకు సన్నాహాలు

ఆసక్తి చూపని ప్రజానీకం

నిరాకరించిన వారిపై రాజకీయ ఒత్తుళ్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదట. చివరకు ఎలాంటి ఆర్డర్ లేకుండానే మనసులో అనుకున్నవన్నీ చకచకా జరిగిపోతాయట. ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబు పాలన ఇందుకు అద్దం పడుతోంది. విశాఖపట్నంలోని ఎయు ఇంజినీరింగ్ గ్రౌండ్‌లో బుధవారం జరగబోయే బహిరంగ సభకు మోడీ హాజరు కానున్న విషయం విధితమే. ఏర్పాట్ల కోసం అక్కడ రూ.కోట్లు ఖర్చుచేస్తున్నారు. తాజాగా మన జిల్లా అధికార యంత్రాంగం జన సమీకరణ, ప్రయాణ ఏర్పాట్లలో తలమునకలైంది. సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఆర్టీసి బస్సులను అధిక సంఖ్యలో మళ్లించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అనధికారిక సెలవు ప్రకటించారు. అనేకసార్లు ప్రధాని విశాఖపట్నం వచ్చినప్పటికీ మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్తున్నారు.

ప్రధాని సభకు జిల్లా నుంచి 24వేల మంది జనాన్ని తరలించాలని అధికార యంత్రాంగానికి లక్ష్యం విధించారు. అనుగుణంగా ఆర్టీసి విజయనగరం డిపో నుంచి 70, ఎస్.కోట డిపో నుంచి 30చొప్పున మొత్తం 100బస్సులు, మరో 150 వరకు ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇవి కాకుండా చిన్నచితక కలుపుకుని జిల్లా వ్యాప్తంగా 425 వాహనాలు ఉంటాయని సమాచారం. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఆర్టీసి డిపోల నుంచి 80బస్సులను ప్రధాని సభకు వైపు మళ్లించారు. బస్సుల మళ్లింపు నేపథ్యంలో జిల్లాలో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురు కానున్నాయి. ఈ సంగతి కాస్త అటుంచితే.... జనం తరలింపునకు ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం నానా తంటాలు పడుతోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ లక్ష్యానికి అనుగుణంగా జనాన్ని తీసుకురావాల్సిందేనంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందట.



మోడీ సభకు జనాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

మరోవైపు జిల్లాలోని మెజార్టీ గ్రామాల్లో వరిచేను నూర్పులు, ధాన్యం విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి చేను, ధాన్యం కూడా కల్లాల్లోనే ఉన్నాయి. వాతావరణం రోజుకోలా ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పటికీ చాలా మంది రైతులు నష్టపోయారు. ఈనేపథ్యంలో రైతు కుటుంబాలవారు ప్రధాని సభకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఈరకమైన ఇబ్బందుల వల్ల కరుడుగట్టిన టిడిపి, జనసేన కార్యకర్తలు కూడా విశాఖ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పార్వతీపురం జిల్లాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో ఈ జిల్లాలోని అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, జనసేన, టిడిపి నాయకులు డ్వాక్రా మహిళలపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలోని ఆయా జిల్లాలో డిఆర్‌డిఎ పీడీలకు జన సమీకరణకు ప్రధాన బాధ్యతలు అప్పగించారు. పాపం...! ఈ సంఘాల్లోనూ ఎక్కువమంది రైతు కుటుంబాలకు చెందినవారే అన్న విషయం గుర్తుకు రాలేదేమో. ఈ నేపథ్యంలో ముందుకు రాని రైతులు, డ్వాక్రా మహిళలపై కొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు కూడా మొదలయ్యాయి. ఈ సారికి మమ్మల్ని వదిలేయండి అంటూకొందరు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగా, ససేమిరా వచ్చేదే లేదంటూ మరికొందరు నాయకులు, ప్రభుత్వ సిబ్బంది ముఖంపైనే చెప్పేస్తున్నారట. మరోవైపు పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటే ప్రభుత్వంపై విమర్శలు మొదలవుతాయని భావించిన ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అనధికారిక సెలవు ప్రకటించింది. ఇందుకనుగుణంగా డిఇఒ నుంచి ఎంఇఒలకు, ఎంఇఒల నుంచి ప్రధాన ఉపాధ్యాయులకు మంగళవారం సాయంత్రం మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ విధమైన ఆదేశాలనుసారం పాఠశాల యాజమాన్యాలు బుధవారం సెలవు అని చెప్పినప్పటికీ ఎందుకు? ఏమిటి? అనే విషయాలను విద్యార్థులకు చెప్పకపోవడం గమనార్హం.

హెచ్‌ఎంపివి పట్ల ఆందోళన వద్దు

ప్రజలు తమవంతు సహకారం అందించాలి : డిఎంహెచ్‌ఒ జీవనరాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

హెచ్‌ఎంపివి వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.జీవనరాణి చెప్పారు. కోవిడ్ సమయంలో తీసుకున్న మాదిరిగానే తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. తమ ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న హెచ్‌ఎంపివి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించడం తదితర ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఇదేమీ అంత ప్రమాదకరం కాదని, ఆందోళన చెందవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులను అదుపు చేసేందుకు జిల్లాలో అన్ని రకాల



జాగ్రత్తలను తీసుకున్నామని తెలిపారు. దీనిలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఏ వ్యాధిని అదుపు చేయాలన్నా, అరికట్టాలన్నా ప్రజల సహకారం తప్పనిసరి అని ఆమె స్పష్టం చేశారు. వ్యాధులను అదుపుచేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం విస్తృత చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించినప్పుడే సరైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు 24 గంటలూ మెరుగైన వైద్యసేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రాణాంతక కేన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి ఇంటింటి సర్వేను ప్రారంభిస్తామని తెలిపారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ సూచించారు. విలేకర్ల సమావేశంలో డిటిఒ డాక్టర్ కె.రాణి, జిల్లా మలేరియా నివారణాధికారి మణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఉద్యోగ నియామక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్టయిఫండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన 7వ రోజు పిఎంటి, పిఇటి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులకు గాను 351 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. నియామకాల ప్రక్రియను ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి పి. సౌమ్యలత పర్యవేక్షించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పిఇటి పరీక్షలను అనుమతించామని తెలిపారు.





గజపతినగరం మండలం బంగారమ్మపేట, విజయనగరంలో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

మత సామరస్యాన్ని కాపాడుకోవాలి

దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణకు సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

సర్వమత సామరస్యమే భారతీయ జీవన విధానమని, తరతరాలుగా అలాగే జీవిస్తున్నారని, జాతీయోద్యమంలో కూడా హిందూ, ముస్లిం, బౌద్ధ, జైన మతాల ప్రజలు ఐక్యంగా బ్రిటీష్ పాలకుల పై తిరుగుబాటు చేసిన చరిత్ర ఉన్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు. అటువంటి భారత దేశంలో మత ప్రాతిపదికన విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని. అందులో భాగంగానే విజయవాడ కేంద్రంగా విహెచ్‌పి హైందవ శంఖారావం సభ జరిపి అబద్ధాలు అర్ధ సత్యాలు ప్రచారం చేసిందని ఆయన అన్నారు. ఎందరు ఎన్ని కుట్రలు చేసినా మతసామరస్యాన్ని, దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడుకుంటామని అన్నారు. దేశ సమైక్యత, మతసామరస్యం, రాజ్యాంగ పరిరక్షణకై దేశ వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్‌విఎన్ నగర్, రామకృష్ణా నగర్‌లో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల పైదాడులు, దేవాలయాల కబ్జాకు ప్రయత్నిస్తున్న మతోన్మాదుల ప్రయత్నాలను తిప్పి కొట్టేందుకు రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం. శాంతమూర్తి, ఎం. జగదాంబ, కె.రమణమ్మ, లింగమూర్తి పాల్గొన్నారు .

గజపతినగరం మండలం బంగారమ్మపేటలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అనేక కులాలు, మతాలు, జాతులు కలగలిపిన వైవిధ్యం కలిగిన లౌకిక భారతదేశమని, అత్యంత ప్రజాస్వామ్యకమైన హక్కులు కలిగిన విలువలకు పీటవేసిన రాజ్యాంగం మనదని వివరించారు. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ వాడిని తరిమికొట్టేందుకు అన్ని మతస్తులు కులస్తులు ఐక్యమై స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనకుండా ఉన్న బ్రిటిష్ వారికి సహకరించిన ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంఘాలు, దాని అనుబంధ రాజకీయ పార్టీ బిజెపి ఇప్పుడు దేశంలో మతసామరస్యానికి విఘాతం కలిగించే చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతనే అమిత్ షా అవమానించడం దౌర్భాగ్యమని అన్నారు. మను ధర్మం అమలు చేయడమంటే అంటరానితనం, కుల వివక్షత, ప్రజాస్వామ్యకు హక్కుల అణిచివేతకు బలవ్వడమేనని అన్నారు. ఈనేపథ్యంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని అన్నారు. కార్యక్రమంలో తెర్లాపు కృష్ణ, కంటురాము, కంటు ఎల్లయ్య, కంటులక్ష్మణ, దేవరపల్లి రమణ, కంటి గురయ్యా తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్


ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లాలో బుధవారం జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో, న్యాయవాదులతో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ప్రమాద బీమా క్లెయిమ్ కేసులన్నీ మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని, అందుకు జాతీయ లోక్ అదాలత్‌ను వేదికగా చేసుకుని ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు డబ్బు సమయం వృథా కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, కె.విజయకల్యాణి, కె.నాగమణి, బి.పద్మావతి, బిహెచ్‌వి లక్ష్మీకుమారి, దేవిరత్నకుమారి, బి.రమ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

రేపు ఎఐసిసి కార్యదర్శి మాణిక్య ఠాగూర్ రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎఐసిసి కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్ ఈనెల 9న జిల్లాకు రానున్నారని డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ తెలిపారు. నెల్లిమర్లలో మధ్యాహ్నం 3గంటలకు జరిగే 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' అనుబంధ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. బిజెపికి చెందిన అమిత్ షా పార్లమెంట్‌లో యుగపురుషులు, రాజ్యాంగ శిల్పి అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌పై చేసిన సిగ్గుమాలిన వ్యాఖ్యలపై యావత్ భారత దేశం రగిలిపోతున్న తరుణంలో, ప్రాంతాలకతీతంగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్న క్షణంలో కాంగ్రెస్ ప్రజాపక్షాన నిలుస్తోందని పేర్కొన్నారు. అమిత్‌షా ప్రజలకు క్షమాపణలు చెబుతూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.



పుష్పయాగంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే బేబినాయన

ఎపిఐఐసి బలోపేతానికి చర్యలు : మంత్రి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర వ్యాప్తంగా ఎపిఐఐసిని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎపిఐఐసిను బలోపేతం చేసేందుకు సంబంధిత ఎండితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. పరిశ్రమలకు స్థలాలు తీసుకున్న పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేయడం లేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని వారిపై చర్యలకు సిద్ధమవుతున్నామని చెప్పారు. మరుపల్లిలో 80 ఎకరాలు భూమిని పారిశ్రామికవేత్తకు కేటాయించినా పరిశ్రమ ఏర్పాటు చేయలేదన్నారు. నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎపిఐఐసిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు మండలానికి, నియోజకవర్గానికి ఒక ఐపిఒను నియమిస్తామన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ కూటమి ప్రభుత్వంపై హేళనగ మాట్లాడడం సరికాదన్నారు. ప్రధాని మోడీ సభకు జిల్లా నుంచి 40వేల మందిని తరలిస్తున్నట్లు చెప్పారు.

పుష్పయాగంలో పాల్గొన్న మంత్రి

స్థానిక కోటలో దర్బార్ మహల్, శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించిన పుష్పయాగంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. వెంకన్న స్వామిని 108 రకాల పువ్వులతో పూజలు చేశారు. కోట నుంచి శ్రీవేణుగోపాల స్వామి ఆలయానికి పువ్వులు బుట్టలను మోసుకుని వెళ్లి స్వామివారికి పుష్పయాగం చేసి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి హాజరయ్యారు. పుష్పయాగానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి

గజపతినగరం : మండలంలోని బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు మంత్రికి స్వాగతం పలికారు. భోగి మంట చుట్టూ విద్యార్థులతో కలిసి ధింసా నృత్యం చేశారు. బాగా చదువుకొని మంచి ర్యాంకులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సఫాయి కర్మచారీ సంఘం అధ్యక్షులుగా కామేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జలగడుగుల కామేశ్ మరోసారి ఎన్నికయ్యారు. ప్రోగ్రెసివ్ కర్మచారీస్ సంఘం జాతీయ అధ్యక్షుడు ఇ. వీరరాజు ఈ మేరకు నియామకపత్రాన్ని కామేష్‌కు అందజేశారు. విజయనగరం జిల్లా బాధ్యతలతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పర్యవేక్షకునిగా కూడా బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఆయన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామేష్ బాధ్యతలను నిర్వరిస్తున్న సంగతి తెలిసిందే. కార్మికుల కోసం మరింతగా పనిచేసేందుకు అవకాశం కల్పించిన ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారీస్ సంఘం జాతీయ అధ్యక్షులు ఇ. వీర్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కామేష్‌కు స్వయంగా రాష్ట్ర అధ్యక్షులు గంద్రేటి అంజిబాబు నియామక పత్రాన్ని అందజేశారు.

రహదారిపై భోగి మంటలు వేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోనిప్రధాన రహదారుల్లో ప్రజల సౌలభ్యం కోసం పరిశుభ్రపరిచే ప్రక్రియ నిర్వహిస్తున్నామని, రహదారులపై బోగి మంటలు వేయకుండా సహరించాలని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. మంటల వేడి వల్ల తారు కరిగి రహదారులపై గుంతలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి రోడ్లపై భోగి మంటలు వేయకుండా రోడ్డు చుట్టుపక్కల గాని, ఖాళీ ప్రదేశాలలో గాని మాత్రమే భోగి మంటలు వేసుకోవాలని సూచించారు. మన రహదారులను మనమే పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

నమస్తే పథకంలో పారిశుధ్య కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత ప్రభుత్వ సూచనల మేరకు డ్రైనేజ్, సెప్టిక్ ట్యాంకులను పరిశుభ్రం చేసే కార్మికులు నమస్తే పథకంలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ సఫాయి కర్మచారి, ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నమస్తే పథకం అమలవుతోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ముందస్తు జాగ్రత్త భద్రతా పరికరాలు, ఆరోగ్య భీమా, వత్తిపరమైన శిక్షణ, జీవనోపాధి కోసం సబ్సిడీ వంటి ప్రయోజనాలు కల్పిస్తామని తెలిపారు. పేర్లు నమోదు లేకుండా డ్రైనేజ్ మరియు సెప్టిక్ ట్యాంకులు పరిశుభ్రపరచడాన్ని కఠినంగా నిషేధిస్తామని తెలిపారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ, పిజి కళాశాలలో మంగళవారం డైకిన్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 162మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు సురేష్, గాయత్రి విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్ కు 162 మంది బిఎస్‌సి విద్యార్థులు హాజరు కాగా 28 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవమణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు అభినందించారు మరియు జీవితం లో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆశించారు. కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్లు షాజీ నాయర్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆశావర్కర్లకు తీపి కబురు చెప్పాలి

- బకాయి జీతం రూ.2800 వెంటనే ఇవ్వాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు సేవలందిస్తున్న ఆశా వర్కర్ల జీతాలు పెంచుతూ ప్రభుత్వం సంక్రాంతికి తీపి కబురు చెప్పాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్రావు డిమాండ్ చేశారు. మంగళవారం పద్మావతి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లతో నిరసన తెలిపారు. పని భారం ఒత్తిడి పెరుగుతుందని, 12 రకాల రికార్డులతో పాటు ఆన్‌లైన్ వర్క్ కూడా చేయాల్సి వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం జీతాలు పెంచుతామని చెప్పి హామీ ఇచ్చి అధికారాన్ని కోల్పోయిందని, ఆ సందర్భంగా ధర్నా శిబిరాల వద్దకు వచ్చి అధికారంలో రాగానే జీతాలు పెంచుతామని చెప్పిన నూతన కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. డిసెంబర్ నెలలో బకాయి ఉన్న రూ.2800 జీతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన జొన్నవలస విద్యార్థి యుగేంద్ర

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు యుగేంద్ర ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 10 నుంచి 13వరకు మహారాష్ట్ర రాష్ట్రం కొల్లాపూర్‌లో జరగబోయే జాతీయస్థాయి అండర్ 14 ఖోఖోపోటీలకు జొన్నవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి యుగేంద్ర ఎంపికైనట్లు పాఠశాల పీడీ రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు అభినందించారు.

సంక్రాంతి కానుకలు పంపిణీ

విజయనగరం టౌన్ : అందరూ సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని ప్రముఖ వ్యాపార వేత్త గుడిశా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి నిత్యావసర వస్తువులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంక్రాంతిని ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో 52 నిత్యావసర వస్తువులను దాతలు సహకారంతో పంపిణి చేస్తున్నట్లు చెప్పారు.

కాసులు కురిపిస్తున్న రోడ్డు పనులు

- బైపాస్ రోడ్డు గోతుల పూడ్చివేతకు రూ.45లక్షలు
- నిధులు ఖర్చు చేస్తున్నా పూర్తి కాని పనులు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
- బొబ్బిలి మున్సిపాలిటీ పనితీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలో గోతుల రోడ్లు కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులు, పాలక వర్గానికి కాసులు కురుపిస్తున్నాయి. రోడ్డు గోతులు కాసులు కురిపించడం ఏమిటి అనుకుంటున్నారా.. రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చి వేసేందుకు మున్సిపల్ నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో పనులు చేయకుండా స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఒక్కటై మున్సిపల్ నిధులను స్వాహా చేస్తున్నారన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది. రెవెన్యూ సెక్షన్‌లో కూడా అవినీతి పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

బైపాస్ రోడ్డు గోతులు పూడ్చివేతకు రూ.45లక్షలు

మున్సిపాలిటీలో బైపాస్ రోడ్డు, జయప్రకాష్ మున్సిపల్ పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి శ్రీదాడితల్లి ఆలయం జంక్షన్ వరకు బైపాస్ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో గోతులు పూడ్చేందుకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.40లక్షలు కేటాయించారు. ఆ నిధులతో ఏడు నెలల క్రితం వెట్ మిక్స్‌తో గోతులను పూడ్చారు. నాసిరకం మెటీరియల్ వాడడంతో వెట్ మిక్స్ వేసిన రెండు నెలలు పూర్తి కాకముందే యథాస్థితికి గోతులు వచ్చాయి. దీంతో ప్రజల నుంచి విమర్శలు రావడంతో గోతులను పూడ్చేందుకు మరో రూ.5లక్షలు కేటాయించినప్పటికీ ఎక్కడ గోతులు అక్కడే దర్శనం ఇస్తున్నాయి. జయప్రకాష్ మున్సిపల్ పాఠశాలకు ఎదురుగా ఉన్న రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో కొన్ని నెలల క్రితం గోతులు వద్ద జరిగిన ప్రమాదంలో ఒక బాలుడు మరణించారు. దీంతో గోతులను పూడ్చాలని స్థానికులు ఆందోళన చేయడంతో సుమారు 50మీటర్లు గోతులను పూడ్చేందుకు రూ.5లక్షలు ఖర్చు చేసినప్పటికీ నాసిరకం మెటీరియల్ వాడడంతో గోతులు యథావిధిగా ఉన్నాయి. గోతులను పూడ్చేందుకు లక్షల్లో నిధులు ఖర్చు చేస్తున్నా నాసిరకం పనులు చేసి నిధులను స్వాహా చేస్తున్నారన్న చర్చ పట్టణంలో బలంగా ఉంది.



మళ్లీ గోతులమయమైన పూల్‌బాగ్ రోడ్డు

తక్కువ పనులు చేసి ఎక్కువ బిల్లు

మున్సి పాలిటీలో మున్సిపల్ పాలక వర్గానికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి తక్కువ పని చేసి ఎక్కువ బిల్లులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లుల్లో అక్రమాలు బయట పడతాయన్న భయంతో అభివృద్ధి పనులను పాలక వర్గానికి చెందిన కాంట్రాక్టర్‌కు మాత్రమే అప్పగిస్తున్నారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మూడున్నరేళ్లుగా 80శాతం పనులు పాలక వర్గానికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్‌కు మాత్రమే కేటాయించారన్న విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి పనులకు వేరే కాంట్రాక్టర్ టెండర్ వేసి పనులను దక్కించుకుంటే పనులు చేయనివ్వకుండా పాలకవర్గం, అధికారులు కలిసి అడ్డుకుంటున్నారని ఒక కాంట్రాక్టర్ వాపోయాడు.

వాల్ పెయింటింగ్స్‌కు రూ.28లక్షలు కేటాయింపు

పట్టణ సుందరీకరణలో భాగంగా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి గోడలపై పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన బొమ్మలు వేసేందుకు రూ.18లక్షలు కేటాయించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జ్యూట్ మిల్లు వరకు రోడ్డు డివైడర్‌కు రంగులు వేసేందుకు రూ.10లక్షలు కేటాయించారు. ఈ రెండు పనులను కూడా మున్సిపల్ పాలక వర్గానికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రెండు పనులలో భారీగా డబ్బులు మిగిల్చేందుకు నాసిరకం పనులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ప్రతిపక్షాలు

మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గతంలో కౌన్సిల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు ప్రకటించారు. అవినీతికి అడ్డుకట్ట పడకపోవడంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్న ఆలోచనలో ప్రతిపక్షాలు ఉన్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

మున్సిపాలిటిలో జరుగుతున్న అవినీతిని ప్రక్షాళన చేసేందుకు ఎమ్మెల్యే బేబినాయన పలు సూచనలు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు నాసిరకం పనులు చేసి నిధులు స్వాహా చేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించకుండా పనులు నాణ్యతగా చేస్తున్న కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్‌ను మారిస్తే అవినీతికి చోటు ఉండదని భావంతో ఎమ్మెల్యే బేబినాయన సూచనలను పక్కన పెట్టారన్న చర్చ జరుగుతుంది.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు

డెంకాడ: పండగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పేకాట, కోడి పందేలలో పాల్గొన్న వ్యక్తులను తహశీల్దార్ సమక్షంలో బైండోవరు చేశామన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వహించడం, బెట్టింగులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా, అటువంటి వ్యక్తులను ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోడి కత్తులను తయారు చేసే వారిపైనా, కోడిపుంజులకు కత్తులు కట్టిన వారిపైనా నిఘా పెట్టామని ఆయన చెప్పారు.

రుణాల కోసం 'బ్యాంకు బాట'

నెల్లిమర్ల: కౌలు రైతులకు పంట రుణాలు కోసం బ్యాంక్ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎ.ఒ.పూర్ణిమ తెలిపారు. మంగళవారం బ్యాంక్ బాట కార్యక్రమంలో భాగంగా ఆమె సతివాడ, రామతీర్థం జిబిబి, నెల్లిమర్లలో ఎస్‌బిఐ, డిసిసిబి బ్యాంక్ లను సందర్శించి కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 7నుంచి 10వరకు బ్యాంకు బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రబీలో రైతులకు రుణం ఇప్పించేందుకు ఒక లిస్టును తయారు చేసి లిస్టులో ఉన్న రైతులకు రుణాలు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి బ్యాంకులను కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ నాటికి రైతులందరికీ రుణాలు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా రైతు లిస్టు తయారు చేసి ఈ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు బ్యాంకులకు అందిస్తున్నామన్నారు. మంగళవారం ధర్మవరం ఎస్‌బిఐ బ్యాంకుకు ఆయన రైతుల లిస్టును అందజేశారు.

క్షయపై అవగాహన

డెంకాడ: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని సింగవరం, నాతవలస గ్రామాల్లో మంగళవారం క్షయ వ్యాధిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి డాక్టర్ రమేష్ పరిశీలించారు. క్షయ లక్షణాలున్న వారికి పరీక్షలు చేసి ఇంటికే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. షుగర్, చెడు వ్యసనాలు, స్మోకర్స్, గతంలో టీబీ మందులు వాడిన వారు, వాళ్ల ఇంట్లో ఉన్న వారికి టీబీ తొందరగా వస్తుందని చెప్పారు. అనంతరం పిహెచ్‌సిని సందర్శించి అక్కడ జరుగుతున్న ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రావు, ఆశ కార్యకర్తలు, యూత్ లీడర్స్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి రాబోయే ఆరు నెలలకు సంబంధించి పూర్తిగా పనులు చేయించాలని, 300 రూపాయలు కూలీ వచ్చేటట్టు మార్కింగ్ ఇచ్చి పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కళ్యాణి, ఎపిఒ సిహెచ్.రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

10న నైపుణ్యాభివృద్ధిపై సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు మెప్మా సర్వీస్ ప్రొవైడర్ల స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి పై సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపాలిటీలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యూటీషియన్, సెలూన్, కార్పెంటర్, ఫ్రిజ్, కూలర్, ఎసి, టివి రిపేర్స్ మొదలగు కోర్సులలో ప్రవేశం ఉన్న వారంతా సమావేశానికి రావాలని కోరారు.

సంత మార్కెట్ స్థలం పరిశీలన

కొత్తవలస: మండల కేంద్రంలోని సంత మార్కెట్ వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని జెడిపి సిఇఒ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్తు పరిధిలోని ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్నామని రానున్న రోజుల్లో సుమారు 6 సెంట్ల స్థలంలో పిహెచ్ మెడికల్ ల్యాబ్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న దానిపై అధికారులతో సమావేశమై తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సంజీవి రమణయ్య, డిఇఇ సిహెచ్ స్వామినాయుడు పాల్గొన్నారు.

అంధులకు ఆర్థిక సాయం

వంగర: విశాఖపట్నం స్వరమాధురి సంస్థకు చెందిన కంటి చూపు కోల్పోయిన అంధులకు స్థానిక వివేక మాస్టర్ మైండ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రూ.26వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తాము దాచుకున్న పాకెట్ మనీ డబ్బులను అంధులకు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పారినాయుడు, చక్రపాణి, రమేష్, శ్రీనివాసరావు, విశాలాక్షి, హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి

రామభద్రపురం: నేటి పొదుపు రేపటి మదుపు అనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలని స్థానిక ఎస్‌బిఐ మేనేజర్ హరింద్రా బెలగాం సూచించారు. ఎస్‌బిఐ బ్రాంచ్‌లో మంగళవారం సాయింత్రం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్రాంచ్ ఖాతాదారుల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. పొదుపుతో పాటు కేంద్రప్రభుత్వ బీమా పథకాలలో చేరి బీమా సౌకర్యాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, క్యాష్ ఇన్చార్జి హరికృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు పనుల కోసం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మండల కేంద్రం మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు మార్గంలో చిరుతపాలెం జంక్షన్ నుంచి బొక్క నాయుడుపేట, రాయుడుపేట గ్రామం వరకు రోడ్డు వేయడానికి పంచాయతీ రాజ్ శాఖ ఎఇ జి మానస ప్రస్తుతం ఉన్న రోడ్డును మంగళవారం పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట నియోజవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, బక్కు నాయుడుపేట టిడిపి అధ్యక్షుడు చొప్ప దేముడు, ఇరు గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

మెరకముడిదాం: మండల సర్వసభ్య సాధారణ సమావేశం మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపిపి తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ శాఖలు వారీగా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శాఖ సమీక్షలో మెరక ముడిదాం పిహెచ్‌సి వైద్యాధికారి అజిత్ బాబు మాట్లాడుతూ దేశంలో కొత్త వైరస్ వచ్చిన సందర్భంగా అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. హార్టీ కల్చర్‌కు సంబంధించిన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ మామిడి తోటలకు రైతులు బీమా చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి. భాస్కరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

104 ద్వారా వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

104 వాహనం ద్వారా వైద్య సేవలను అందించాలని వార్డు సభ్యుడు చిప్పాడ శేషగిరి డిమాండ్ చేశారు. ఎస్‌కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ ఒకటి, రెండు సచివాలయాల పరిధిలో గల వీధులలోకి 104 వైద్య వాహనం రావడం లేదని దీంతో ముసలి వాళ్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ, వార్డ్ సభ్యులు ఆశీల రామకృష్ణ, సీదరి అర్జున్, వివిధ శాఖలు అధికారులు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని చల్లపేట పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పిహెచ్‌సి, స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో కంటి సంబంధిత సమస్య ఉన్నవారు తనికీలు చేసుకున్నారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యనిపుణులు వివేక్‌వర్మ 37 మందికి పరీక్షలు నిర్వహించగా 16 మందికి కేటరాక్ట్ సర్జరీకి సిఫారసు చేశారు. వారికి శంకర్ ఫౌండేషన్ బస్ ద్వారా తరలించి ఆపరేషన్ చేసి తిరిగి పంపనున్నారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. చల్లపేట పిహెచ్‌సి వైద్యులు జిలానిభాష, ఉషా రాణి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎల్ఎల్ఎన్ మూర్తి శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

కిశోర వికాసం పై శిక్షణ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం కిశోర వికాస శిక్షణా కార్యక్రమం ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్ రాంబాబు మాట్లాడుతూ కిశోరి బాలికలకు విద్య, ఆరోగ్యం, పౌష్టిక ఆహారం, జీవన ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. కిశోరి వికాసం పై ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త అవగాహన కలిగి ఉండాలని ఐసిడిసి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ త్రినాధ రావు, అంగన్వాడి సూపర్‌వైజర్ ఉషారాణి, వెంకటలక్ష్మి, తెర్లాం పిహెచ్ డాక్టర్, పెరుమాలి పిహెచ్ డాక్టర్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, మహిళా పోలీసు, ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : బాల్య వివాహాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయని ఎంపిడిఒ పి.రవి కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోర్ వికాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు 21 ఏళ్ళు నిండిన తరువాత మాత్రమే వివాహం చెయ్యాలన్నారు. పిరిడి పిహెచ్‌సి వైద్యులు రఘు వంశీ మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భం దాల్చడం ప్రమాదకరమన్నారు. ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో యంఇఒ-2 వాసు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, ఎపియం భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, కార్యదర్శిలు, విఒఎలు పాల్గొన్నారు.

రామభద్రపురం: బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ రత్నం, తహశీల్దార్ సులోచనారాణి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కిశోర బాలికలు, బాలుర వికాసం కోసం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. టీనేజ్ పిల్లలు ఎక్కువగా చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి వారిని గుర్తించి అవగాహన కల్పించాలన్నారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం చేపడుతున్న భూములు రీసర్వేను భూయజమానులు, అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బి. సుదర్శనరావు కోరారు. మంగళవారం బొప్పడాంలో భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుదర్శనరావు మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కు సమస్యలు, సరిహద్దు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వివరించారు. దీనిలో భాగంగా గ్రామ బౌండరీ పై సర్వే జరుగుతుందని, ఈ నెల 20వ తేదీ నుంచి రైతులకు సంబంధించిన భూములను సర్వే చేయడానికి ఆధునిక డ్రోన్ ద్వారా సర్వే చేస్తామన్నారు. వివాదాలు ఉన్న వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబల్ల కిరణ్‌కుమార్, ఎంపిటిసి బొంతు పురుషోత్తంనాయుడు, రీ సర్వే డిటి ఎం. సత్యనారాయణ, విఆర్ఒ గోవిందరావు, మండల సర్వేయర్ టి. దివ్య మానస, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఇనాం భూములను సర్వే చేయాలి

తమ గ్రామానికి సంబంధించిన ఇనాం భూములను పూర్తిగా సర్వే చేయాలని తంగుడుబిల్లి ఎంపిటిసి చిన్నంనాయుడు, సర్పంచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దారుకు రైతులు వినతి పత్రాన్ని అందించారు.

వేపాడ: మండలంలోని రాయుడుపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముటేషన్ల కోసం రైతులు నుంచి ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ జె. రాములమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వే గంగాధర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

18 ఏళ్ల తరువాత కుటుంబం చెంతకు..

జమ్మూ కాశ్మీర్‌లో గుర్తింపు

ప్రజాశక్తి - జామి

మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన వాకాడ కొండమ్మ 18 ఏళ్ల క్రితం తీర్థయాత్రలకు వెళ్లి తప్పిపోయి, ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఆకుటుంబంతో పాటు విజినిగిరి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం.. కొండమ్మకు కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. ఏళ్ళ క్రితం తీర్థ యాత్రలకు వెళ్లి తప్పి పోయిన కొండమ్మను, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. చివరకు ఆమె ఇటీవల జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని జమ్ములో యాచన చేస్తూ విజినిగిరి గ్రామానికి చెందిన సైనిక ఉద్యోగి (విజినిగిరి హెల్పింగ్ హాండ్స్ సభ్యుడైన) సైలాడ సాయి, మణికంఠలకు కనిపించింది. ఆమె అక్కడ తెలుగు భాష మాట్లాడటంతో సాయి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఆమె విజినిగిరి గ్రామానికి చెందిన మహిళ అని గుర్తించి విజినిగిరి హెల్పింగ్ హాండ్స్ కమిటీ మెంబర్లకి తెలియజేశారు. 15 రోజులు ఆమెకు అక్కడ ఆహారం, చెప్పులు స్వెటర్, బట్టలు అందజేసి, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, ఆమె భర్త పిల్లలతో మాట్లాడి వాళ్ల అనుమతితో ఆమెను జమ్ము నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చే ఏర్పాటు చేశారు. ఆమె జమ్ము నుంచి స్వగ్రామానికి చేరుకోవడానికి సుమారు రూ.10వేలు ఖర్చుని విజినిగిరి హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్, సైలాడసాయి కలిపి పెట్టుకున్నారు. ఈ విషయం తెలిసిన ఆమె కుటుంబ సభ్యులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని తిమిడి గ్రామ పంచాయతీ సెక్రటరీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేస్తున్న పల్లకిల సూరిబాబుకి 2023, 2024 సంవత్సరానికి సంబంధించి 18 నెలలు జీతం తిమిడి గ్రామపంచాయతీ చెల్లించవలసి ఉండగా చెల్లించుకున్న ఆ కార్మికుడితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. తిమిడి గ్రామ పంచాయతీ ఎస్.కోట గ్రామపంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లకు 12 నెలలు ఎస్‌కోట మేజర్ పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 4 నెలలు జీతాలు బకాయిలు ఉన్నా పంచాయతీ అధికారులు సంక్రాంతి పండుగతో పస్తులుండి పనిచేయమంటారా అని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా అధికారులు జిల్లాలో ఉన్న అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి బకాయి జీతాలు చెల్లించాలని సర్క్యులర్ పంపించారన్నారు. పండగ లోపు బకాయి ఉన్న జీతాలు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య పనులు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, పారిశుధ్య కార్మికులు పల్లకిలో సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యంపై కేసు నమోదు

భోగాపురం : ఇంటర్మీడియట్ చదువుతున్న బాలుడు అదృశ్యం కావడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొల్లింకలపాలెం గ్రామానికి చెందిన తోటకూరి భాను ప్రకాష్ తగరపువలసలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. గత నెల 23వ తేదీన కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు గాలిస్తున్నప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పాపారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైట్‌లో ఆకట్టుకున్న రంగోత్సవ్ వేడుకలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ (డైట్)లో మంగళవారం నిర్వహించిన రంగోత్సవ్ వేడుకలు ఆకట్టుకున్నాయి. పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో జరజాపుపేట జెడ్‌పి హైస్కూల్ ప్రథమ స్థానం, ఎపిఎంఎస్ మదనాపురం ద్వితీయ స్థానం, గొట్లాం తృతీయ స్థానం, డ్రాయింగ్ లో ఎంజెపి స్కూల్ నెల్లిమర్ల ప్రథమ స్థానం, చీపురుపల్లి జెడ్‌పిహెచ్ఎస్ ద్వితీయ స్థానం, గొట్లాం జడ్పిహెచ్ఎస్ తృతీయ స్థానం, చేతిరాతలో ఎపిఎంఎస్ మదనాపురం ప్రథమ, ఎంజెపి నెల్లిమర్ల ద్వితీయ, గొట్లాం జడ్పిహెచ్ఎస్ తృతీయ స్థానం సాధించాయి. రంగోలిలో ఎంజెపి నెల్లిమర్ల ప్రథమ, జరజాపుపేట జడ్పిహెచ్ఎస్ ద్వితీయ, గొట్లాం జడ్పిహెచ్ఎస్ తృతీయ, జానపద నృత్యంలో చీపురుపల్లి జడ్పిహెచ్ఎస్ ప్రథమ, నెల్లిమర్ల ఎంజెపి ద్వితీయ, ద్వారపూడి జడ్పిహెచ్ఎస్ తృతీయ స్థానం సాధించాయి. డిజిటల్ కాలేజ్ యూనిటీ, ఇంటిగ్రేట్ పోస్టర్‌లో మదనాపురం ఎపిఎంఎస్ ప్రథమ, జరజాపుపేట జడ్పిహెచ్ఎస్ ద్వితీయ, రోల్ ప్లేలో గొట్లాం జడ్పిహెచ్ఎస్ ప్రథమ, మదనాపురం ఎపిఎంఎస్ ద్వితీయ, నెల్లిమర్ల ఎంజెపి తృతీయ స్థానం, ఏక్ భారత్ విశిష్ట భారత్ స్లోగన్స్‌లో గొట్లాం జడ్పిహెచ్ఎస్ ప్రథమ, వేణుగోపాలపురం జిపియుపి స్కూల్ ద్వితీయ, చీపురుపల్లి జడ్పిహెచ్ఎస్ తృతీయ స్థానం సాధించారు. ప్రథమ స్థానం సాధించిన వారు 8న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వర రావు, ఎల్.రామకృష్ణారావు పి.రవికుమార్, కె.సూర్యారావు, మాత రామకృష్ణ, వివిజె సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, భారతి తదితరులు పాల్గొన్నారు.

సహారా డిపాజిట్ చెల్లింపుపై ప్రకటన చేయాలి


ప్రజాశక్తి-బొబ్బిలి

సహారా ఇండియా ఖాతాదారుల డిపాజిట్ సొమ్ము చెల్లింపుపై విశాఖ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రకటన చేయాలని సహారా ఇండియా బాధితుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మీదాసు, జిల్లా కమిటీ సభ్యులు పి.ధనంజయ్ నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 13 కోట్ల మంది ఖాతాదారులు సహారాలో రూ.84వేల కోట్లు డిపాజిట్ చేశారని, వారికి వడ్డీతో రూ.3లక్షల కోట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించడం లేదన్నారు. రాష్ట్రంలో కోటి మంది ఖాతాదారులు నుంచి 80వేల మంది ఏజెంట్లతో రూ.25వేల కోట్లు డిపాజిట్లు సేకరించామని, ఆయా సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో ఖాతా దారులు తమపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఒత్తిడితో రాష్ట్రంలో 7,800మంది ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహారా యాజమాన్యానికి కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందని విమర్శించారు. విశాఖ వస్తున్న మోడీ సహారా డిపాజిట్ సొమ్ము చెల్లింపుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాధితుల సంఘం నాయకులు ఎస్. నర్సింహ నాయుడు, టి.పాపారావు, జి.నాగరాజు, పి.తిరుపతి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- గజపతినగరం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె. మోహన్‌రావు అన్నారు. మండలంలోని పురిటిపెంట బాలికల ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ. పైడితల్లి తాను రూపొందించిన సాంఘిక శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను మంగళవారం విద్యార్థులకు డిప్యూటీ డిఇఒ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ రూపొందించి, విద్యార్థులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని, ఈ సబ్జెక్టులో మంచి మార్కులు సాధించాలని, మొత్తంగా 10 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.రమేష్ కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అడ్డూరి పైడితల్లి, ఉపాధ్యాయ సిబ్బంది, పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒ శ్రీనివాసరావు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దోమలు పెరగకుండా ఏంటీ లార్వ మందులు పిచికారి చేస్తున్నారు. సంక్రాంతి పండగ మంచి వాతావరణంలో జరగాలన్న ఆలోచనతో పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఆకులపేట, పినతాడివాడ, మోపాడ, గంట్లాం, వెదుళ్లవలస, అక్కివరం, నాతవలస, డి.తాళ్లవలస గ్రామపంచాయతీలలో సర్పంచులు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు సమక్షంలో పారిశుధ్య పనులు చేశారు. ఈ పనులను పంచాయితీరాజ్ ఇఒ దేశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. No.17/2024

Between:-
KathiriVenkateswaraRao, S/o late Paidithalli, aged about 53 Years, resident of Door No. 1-13-12A, Band Street, Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
...Petitioners
And:
PunyapuAruntaKumari and 15 others.
....Respondents

NOTICE TO RESPONDENT No.1 TO RESPONDENT No.16

R-1: Punyapu Arunta Kumari, W/o KameswaraRao, aged about 68 years, Hindu, resident of Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
R-2: Pothula Suryanarayana, S/o AppaRao, aged about 56 years, Hindu, resident of Akkayyapalem. Visakhapatnam.
R-3: Punyapu Kumar, S/o Kameswararao, 48 years, Hindu, resident of Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
R-4: RokkamSyamala, W/o Satyam, aged about 56 years, Bugguladibba, Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
R-5: Siripurapu Papa Rao, S/o. Satyanarayana, aged about 42 years, Railway employee, r/o near Ashok Bunglow, R & B Guest House, Vizianagaram Town, Municipal Corporation and District.
R-6: Pedireddla Kavya Manasa W/o. Rama Rao, aged about 33 years, Hindu, resident of Buradipeta, Rajamahendravaram, East Godavari District, A.P.
R-7: Oogi Kumar, S/o. SayamalaRao, aged about 50 years, Kirana Shop, RelliVeedhi, Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
R-8: Karaka Valasa Anil Kumar, S/o. VenkateswaraRao, aged about 43 years, Hindu, Document Writer, near Collector Office, Vizianagaram Town, Municipal Corporation and District.
R-9: Pedlapu Ramesh, S/o. Ramulu, aged about 45 years, Hindu, KamboiVeedhi, near Ramamandiram, Vizianagaram Town, Municipal Corporation and District.
R-10: Bobbadi Divya, W/o. Jagadeesh, aged about 42 years, Hindu, Alakananda Colony, Vizianagaram Town, Municipal Corporation and District.
R-11: Macha SrinivasaRao S/o. VenkataRao, aged about 45 years, Hindu, Main Road, Kondkarakam Village, Vizianagaram Mandal and District.
R-12: Pondhuru Srinu, S/o. Satyam, aged about 40 years, Hindu, Document Writer, near Collector Office, Vizianagaram Town, Municipal Corporation and District.
R-13: Motumarri Rajendra Kumar, S/o. Late KameswaraRao, aged about 55 years, Hindu, Jai Matha Departmental Stores, Cantonment, near Municipal High School, Vizianagaram Town, Municipal Corporation and District.
R-14: NalamVani, W/o Nagu, aged about 56 years, Hindu, SaiRatnaHights Apartment, Cantonment, Vizianagaram Town, Municipal Corporation and District.
R-15: Kumar Jain, S/o. BirandraJain, aged about 49 years, Hindu, Bondada Street, Vizianagaram Town, Municipal Corporation and District.
R-16: Kobbada Venkata Ramana S/o SrinivasaRao, aged about 50 years, Hindu, Document Writer, Jammunarayanapuram, Vizianagaram Mandal and District.

ఇందుమూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా విజయనగరంజిల్లా, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ కంటోన్మెంట్, బ్యాండ్ వీధి, డోర్ నెంబర్ 1-13-12A, కాపురస్తులు కథిరి వెంకటేశ్వరరావు,S/o లేటు పైడితల్లిగారు తనకున్న అప్పులు చెల్లించలేని శక్తిలేదని తీర్పుచేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమ శ్రీసీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, విజయనగరంలో I.P.No.17/2024 పిటీషన్ దాఖలుచేసియున్నారు. కావున ఎవరికైనన ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్నయెడల స్వయముగా గాని లేదా వకీల గా ద్వారాగాని **తే22-01-2025 దిన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పైన తెలిపి కోర్టులో హాజరు కావలెనని,లేనిపక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈపత్రిక ప్రకటనద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

KALISETTY EASWARA RAO,
ADVOCATE FOR THE PETITIONER,
VIZIANAGARAM, Mobile No. 9440836875.